క్లుప్తంగా

నేడు పంచాయతీ కార్యదర్శుల సమావేశం

కెరమెరి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సత్యనారాయణగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 8న నిర్వహించనున్న ఊరూరా చెరువుల పండుగ, తదితర విషయాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి


మాట్లాడుతున్న స్త్రీనిధి మేనేజర్

కెరమెరి: బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని స్త్రీనిధి మేనేజర్ పృథ్వీరాజ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మెట్టపిప్రి గ్రామంలో గ్రామైఖ్య సంఘ సభ్యులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో తీసుకున్న బకాయిలు సకాలంలో చెల్లిస్తే తిరిగి బ్యాంకులు కొత్త రుణాలు ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. సంఘంలో పొదుపు బాగా చేయాలని, రికార్డులు సరిగా రాయాలని పేర్కొన్నారు. సంఘ బలోపేతం కోసం సీసీలు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సీసీ ధన్‌రాజ్, వీవోఏ లక్ష్మి తదితరులు ఉన్నారు.

'సింగరేణి తోడ్పాటుతో తాగునీటి సౌకర్యం'


చేతిపంపు ప్రారంభిస్తున్న సర్పంచ్ పోషమల్లు

రెబ్బెన: సింగరేణి యాజమాన్యం అందించిన తోడ్పాటుతో కొత్త పులికుంటలో మంచినీటి సౌకర్యం కల్పించినట్లు పులికుంట సర్పంచ్ బుర్స పోషమల్లు అన్నారు. కొత్త పులికుంటలో సింగరేణి సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన బోర్‌వెల్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. తాగునీటి సమస్యను జీఎం దేవేందర్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన పులికుంట పంచాయతీకి సీఎస్ఆర్ నిధులతో రెండు బోర్‌వెల్స్ మంజూరు చేశారన్నారు.

గర్భిణులకు పౌష్టికాహార కిట్లు అందజేత


కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

బెజ్జూర్: మండలంలోని ఉట్ సారంగపల్లి గ్రామంలో గల రైతువేదికలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు గర్భిణులకు పౌష్టికాహారం కిట్లు అందజేశారు. గర్భిణులకు నిర్వహించే సీమంతం కార్యక్రమంలో పాల్గొని తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై వివరించారు. కార్యక్రమంలో ఎంపీవో రమేశ్ రెడ్డి, ఏపీవో, మండల కోఆప్షన్ సభ్యులు బషరత్ ఖాన్, పీఏసీఎస్ చైర్మన్ కుర్సింగా ఓంప్రకాష్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు దుర్గం నారాయణ, ముడిమడుగుల పెంటయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

23న అద్దె గదులకు బహిరంగ వేలం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపల్ వాణిజ్య అద్దె గదులకు ఈనెల 23న బహిరంగ వేలం ప్రక్రియ నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ అంజయ్య తెలిపారు. మంగళవారం బహిరంగ వేలం నిర్వహించగా తక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయని, ఎస్టీలకు కేటాయించిన గదికి ఎలాంటి దరఖాస్తు రాలేదని పేర్కొన్నారు. బహిరంగ వేలంలో పాల్గొనే పట్టణ ప్రజలు, వ్యాపారులు ఈనెల 22వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా ధరావత్తు చెల్లించాలని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ ప్రకారం అద్దె గదులు కేటాయిస్తామని తెలిపారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ఎస్సీ గురుకుల కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం సీట్ల భర్తీకి ఈనెల 6 నుంచి 15 వరకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫీజు రూ. 100 చెల్లించాలని, అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'మినీ ట్యాంకుబండ్'కు మోక్షమెప్పుడో?

- ఎల్లమ్మ చెరువు అభివృద్ధికి ఎదురుచూపులు
- ఆహ్లాదానికి దూరమవుతున్న ప్రజలు


రెబ్బెన మండల కేంద్రానికి ఆనుకొని ఉన్న ఎల్లమ్మ చెరువు

రెబ్బెన: మండల కేంద్రానికి ఆనుకొని ఉన్న ఎల్లమ్మ చెరువుపై మినీ ట్యాంకు బండ్ నిర్మించేందుకు అనుకూలంగా ఉన్నప్పటికీ అధికారులు ఆ దిశగా దృష్టి సారించడం లేదు. మిషన్ కాకతీయ పనుల ప్రారంభోత్సవంలో భాగంగా మంత్రి హరీశ్‌రావు ఎల్లమ్మ చెరువుపై మినీ ట్యాంకు బండ్ ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినా నేటికి మంత్రి హామీ అమలుకు నోచుకోవడం లేదు.

ఏళ్లుగా ఎదురుచూపులు..

మండల కేంద్రానికి ఆనుకొని విశాలమైన ఎల్లమ్మ చెరువును సుందరీకరించి ట్యాంకుబండ్‌గా మార్చేందుకు నిధులు మంజూరు చేయించుకోవడంలో అధికారులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. మండల కేంద్రానికి ఆనుకొని ఉండటంతో పాటు జాతీయ రహదారి సైతం ఎల్లమ్మచెరువు పక్కనే ఉండటంతో చెరువును మినీట్యాంకు బండ్‌గా మార్చాలని మండలవాసులు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నారు. 2015లో ఎల్లమ్మ చెరువులో చేపట్టిన మిషన్ కాకతీయ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు మండలవాసుల కోరిక మేరకు మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చేందుకు హామీ ఇచ్చారు. మంత్రి ఇచ్చిన హామీ నేటికీ కార్యరూపం దాల్చకపోవటంతో మినీ ట్యాంక్ బండ్ ఏర్పాటు కలగానే మిగిలిపోయింది. చెరువును అభివృద్ధి చేసి కట్టపై ఆహ్లాదాన్ని పెంచేలా పూలమొక్కలు, నీడనిచ్చే చెట్లను పెంచితే పచ్చదనంతో పాటు ప్రజలకు ఆహ్లాదం అందే అవకాశం ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మిషన్ కాకతీయ పనుల్లో భాగంగా చెరువు కట్టపై మట్టి పోసి చదును చేయగా ప్రస్తుతం కట్ట ముళ్ల పొదలతో నిండిపోయి కళావిహీనంగా మారింది.

వాకర్స్‌కు తప్పని తిప్పలు

ఎల్లమ్మ చెరువును మినీ ట్యాంకు బండ్‌గా మారిస్తే మండల కేంద్రం వాసులు సాయంత్రం వేళ కుటుంబ సభ్యులతో ప్రశాంత వాతావరణాన్ని ఆస్వాదించటంతో పాటు ఉదయం, సాయంత్రం వేళల్లో వాకర్స్ సైతం వాకింగ్ చేసుకునేందుకు అనుకూలంగా ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. మంత్రి హామీ మేరకు ఎల్లమ్మ చెరువు అభివృద్ధి, సుందరీకరణ, ట్యాంకు బండ్ ఏర్పాటు కోసం ఇరిగేషన్ అధికారులు రూ.7 కోట్లతో ప్రతిపాదనలు పంపించినప్పటికీ ప్రభుత్వం ప్రతిపాదనను తిరస్కరించింది. ఇరిగేషన్ అధికారులు మరో ప్రయత్నం చేయకుండానే ట్యాంకు బండ్ ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు. అధికారులు పంపిన ప్రతిపాదనల్లో చెరువు కట్టను విస్తరణ కట్టపై సెంట్రల్ లైటింగ్, తారురోడ్డు, కట్టకు ఇరువైపుల అందమైన మొక్కల పెంపకం, వాటి కింద ప్రజలు సేద తీరేందుకు వీలుగా సిట్టింగ్ సిస్టం, అక్కడక్కడ కూర్చునేందుకు వీలుగా గడ్డి మ్యాటింగ్ వంటి అనేక పనులు పొందుపర్చినప్పటికీ ప్రభుత్వం తిరస్కరించటంతో మండలవాసుల ఆశలపై నీళ్లు చల్లినట్లయ్యింది.

ప్రత్యేక చొరవ చూపాలి



మండల కేంద్రానికి ఆనుకొని ఉన్న ఎల్లమ్మ చెరువుపై మినీ ట్యాంకు బండ్ ఏర్పాటు కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపాలి. గతంలో రాష్ట్ర మంత్రి సైతం మినీ ట్యాంకుబండ్ ఏర్పాటుకు హామీ ఇచ్చారు. కాని ఇప్పటివరకు ఎలాంటి పనులు చేపట్టలేదు.

\- ఫణికుమార్

కట్టపై ముళ్లపొదలు పెరిగాయి



ఎల్లమ్మ చెరువును అభివృద్ధి చేసి కట్టపై మొక్కలు నాటి అందంగా తీర్చిదిద్దితే ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుంది. దాని కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం. చెరువు అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోకపోవటంతో ప్రస్తుతం కట్టపై ముళ్లపొదలు పెరిగి నడిచి వెళ్లేందుకు కూడా వీలు లేదు.

\- కుందారపు శంకరమ్మ

ఎంతో అవసరం ఉంది



మండల కేంద్రంలో ఒక్క పార్కు కూడా లేదు. కనీసం వాకింగ్ చేసేందుకు అనువైన ప్రదేశం లేదు. మినీ ట్యాంకు బండ్ ఏర్పాటు చేస్తే ప్రజలతో పాటు వాకర్లకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రతీ ఒక్కరు కుటుంబ సభ్యులతో సరదాగా గడిపేందుకు మినీట్యాంకు బండ్ ఎంతో అవసరం.

\- దుర్గం భరద్వాజ్

అనాథ పిల్లలకు ఆర్థిక సాయం


ఆర్థికసాయం అందజేస్తున్న సంఘం నాయకులు

కౌటాల: అనాథ పిల్లలకు మాలి సంఘం అండగా ఉంటుందని మాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెండుగురే శ్యాంరావ్ అన్నారు. మండలంలోని ముత్తంపేట్ గ్రామంలోని అనాథ పిల్లలను ఆయన పరామర్శించారు. బాధిత పిల్లలకు రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఏడాది వ్యవధిలో పిల్లలు తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారడం చాలా బాధాకరమన్నారు. పిల్లల తండ్రి బాపురావ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో సంఘం ఆధ్వర్యంలో రూ.20 వేలు అందించినట్లు తెలిపారు. సర్పంచ్ ఆదే శ్రీనివాస్, మాలి సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆదే వసంత్‌రావు, సంఘం నాయకులు నాందేవ్, పాండురంగ్, ముక్తేశ్వర్, అశోక్, వెంకట్, బాజీరావ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువుల పండుగ విజయవంతం చేయాలి


దహెగాం: మాట్లాడుతున్న తహసీల్దార్, ఎంపీడీవో

కౌటాల: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించే చెరువుల పండుగను మహిళలు, రైతులు విజయవంతం చేయాలని తలోడి సర్పంచ్ శంకరమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని తలోడి గ్రామంలో మహిళలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఊరూరా చెరువుల పండుగలో భాగంగా రేపు సాయంత్రం 5 గంటలకు స్థానిక చెరువు వద్దకు డప్పులు, బోనాలతో వెళ్లి మహిళలు బతుకమ్మ ఆటలు ఆడాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

దహెగాంలో..

దహెగాం: మన ఊరు మన చెరువు పండుగను జయప్రదం చేయాలని తహసీల్దార్ ప్రహ్లాద్, ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా దహెగాం, హత్తిని, కుంచవెల్లి, కల్వాడ గ్రామాల్లోని నాలుగు చెరువులను ఎంపిక చేశామన్నారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపుల డీలర్లు నిబంధనలు పాటించాలి


ఫర్టిలైజర్ షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

కౌటాల: ఫర్టిలైజర్ షాపు డీలర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని కాగజ్‌నగర్ డివిజన్ సహాయ సంచాలకులు మనోహర్ అన్నారు. మంగళవారం మండలంలోని ముత్తంపేట్ గ్రామంలోని పలు ఫర్టిలైజర్ షాపుల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. పలు రికార్డులు, విత్తనాల ప్యాకెట్లు, ఎరువుల స్టాక్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గడువు ముగిసిన విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అధిక ధరలకు విత్తనాలు, మందులు విక్రయించొద్దని, విత్తనాలు, ఎరువుల ధరలను బోర్డులో ప్రదర్శించాలన్నారు. క్రయవిక్రయాల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. విత్తనాలు, ఎరువులు విక్రయించిన రశీదును రైతులకు అందజేయాలని తెలిపారు. ఆయన వెంట ఏవో పాలకుర్తి రాజేశ్, తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న బడిబాట


రింగన్‌ఘాట్‌లో కొనసాగుతున్న బడిబాట

కెరమెరి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బడిబాట కార్యక్రమం కొనసాగుతోంది. మంగళవారం కెరమెరి, గోయగాం, ఝరి కాంప్లెక్స్‌ల్లోని 57 పాఠశాలల్లో కార్యక్రమం నిర్వహించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. నాలుగు రోజుల్లో 95 మంది విద్యార్థులు నూతనంగా ప్రవేశానికి సిద్ధంగా ఉన్నట్లు నివేదికలు సమర్పించారు.

ఆసిఫాబాద్ మండలంలో..

ఆసిఫాబాద్‌రూరల్: బడీడు పిల్లలను సర్కారు బడిలోనే చేర్పించాలనే సంకల్పంతో చేపడుతున్న బడిబాట కార్యక్రమం మంగళవారం చోర్‌పెల్లి, తుంపెల్లి, మోతుగూడలో కొనసాగింది. సీఆర్పీ తిరుపతి, నగేష్, ప్రధానోపాధ్యాయులు రమేశ్ ప్రభుత్వ పాఠశాలల్లోని సౌకర్యాలు, విద్యపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

న్యూట్రీ గార్డెన్‌లను సంరక్షించాలి


మొక్కలు నాటుతున్న అంగన్‌వాడీ టీచర్లు

కౌటాల: న్యూట్రీ గార్డెన్‌లలోని కూరగాయల పంటలను సంరక్షించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షకీరాబేగం అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని కోయగూడలోని అంగన్‌వాడీ కేంద్రంలో న్యూట్రీ గార్డెన్‌లో ఆమె కూరగాయల మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు మండుతున్నాయని, మొక్కలు ఎండిపోకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జీజాబాయి, రమా, విజయ, అనిత, భూదేవి, సుజాత, విమల పాల్గొన్నారు.

ఎయిడ్స్‌ను నియంత్రించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌జీవో సభ్యులు

సిర్పూర్(టి): ఎయిడ్స్ వ్యాధిని నియంత్రించాలని మండల కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ కిజర్‌హుస్సేన్ అన్నారు. మంగళవారం సిర్పూర్(టి) గ్రామపంచాయతీ పరిధిలోని జైభీంనగర్ కాలనీలో శ్రీ సాయి మహిళా మండలి(ఎన్‌జీవో) ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శ్రీ సాయి మహిళా మండలి సభ్యులు ఈర్ల సునీల్, అనికేత్, జీఎస్ఎం కవిత, సభ్యులు సుమలత, భాగ్య, ప్రగతి, స్రవంతి, సరోజ, వార్డు సభ్యులు ఇఫాత్‌హుస్సేన్, మౌల్కర్ సంతోశ్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' తనిఖీ బృందం రాక


అగర్‌గూడలో నిర్వహిస్తున్న గ్రామసభ

కెరమెరి: ఉపాధి సామాజిక తనిఖీ బృందం సభ్యులు ఈ నెల 12న రానున్నట్లు ఈజీఎస్ ఏపీవో మలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధిహామీ పథకానికి సంబంధించిన పత్రాలు, వర్క్‌ఫైల్, ఎంబీలు, జాబ్‌కార్డుల అప్‌డేషన్, రిజిస్ట్రేషన్ అప్‌డేషన్, నర్సరీ రిజిస్టర్లు, ఇతర రికార్డులు సరి చేసుకోవాలని తెలిపారు. ఉపాధిహామీ టీఏలు, ఎఫ్ఏలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు సిద్ధంగా ఉండాలని, తనిఖీ బృందానికి పూర్తిగా సహకరించాలని కోరారు.

పంచాయతీల్లో గ్రామసభలు

పెంచికల్‌పేట్: మండలంలోని ఆయా గ్రామపంచాయతీల్లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ గ్రామసభలను సర్పంచ్‌ల అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఆయా పంచాయతీల్లో ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనుల వివరాలు, కూలీలకు చెల్లించిన నగదు వివరాలను చదివి వినిపించారు. పంచాయతీల్లో నిర్వహించిన గ్రామసభల్లో కూలీలు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. గ్రామసభల్లో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ అధికారులు, సిబ్బంది, డీఆర్‌పీలు, ప్రజలు పాల్గొన్నారు.

ఎల్కపల్లిలో ప్రజావేదిక

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని ఎల్కపల్లి రైతు వేదికలో ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదికను బుధవారం ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో గంగాసింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

జీలుగు.. పంటకు జీవం!

- అందుబాటులో విత్తనాలు
- సబ్సిడీపై అందజేత


రైతులకు పంపిణీ చేస్తున్న జీలుగు విత్తనాలు (ఫైల్)

కౌటాల: ఆరుగాలం కష్టపడే రైతులకు సాగు చేస్తున్న పంటలే జీవనాధారం. కొంతమంది రైతులు సాగు పద్ధతులపై సరైన అవగాహన లేక తీవ్రంగా నష్టపోతున్నారు. తొలకరి జల్లులు రాగానే ప్రధాన పంటలు వేసే ముందు పచ్చిరొట్ట ఎరువుల సాగుతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. భూసారం పెరగడంతో పాటు నాణ్యమైన దిగుబడి రావడంలో పచ్చిరొట్ట ఎరువులు కీలక భూమిక పోషిస్తాయి. జీలుగు, జనుము, సీమజీలుగు, పిల్లి పెసర, నీలి, ఆడవినీలి (వెంపలి) తదితర మొక్కలను పొలంలో కలియదున్నడం వల్ల భూమి సారవంతంగా మారుతుంది. పచ్చిరొట్ట ఎరువుల్లో ముఖ్యంగా జీలుగు సాగు చక్కటి ఫలితాలు ఇస్తుందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

ప్రయోజనాలు అనేకం..

పచ్చిరొట్ట ఎరువుతో మొక్కలకు 2శాతం నత్రజని, సూపర్‌పాస్ఫేట్ అదనంగా అందుతుంది. జింక్, మాంగనీస్, ఇనుము, కాల్షియం వంటి సూక్ష్మధాతువులు పంటకు చేరుతాయి. నేలలో కరగని మూలకాలను పంటలకు అనుకూలంగా పచ్చిరొట్ట ఎరువులు మార్చుతాయి. నీటి నిల్వ సామర్థ్యం, నత్రజని స్థిరీకరణ, వానపాముల వృద్ధితో పాటు తుంగ, గరిక వంటి కలుపు మొక్కలను అడ్డుకుంటాయి. నేల భౌతిక స్థితి మెరుగుపడి, భూమి గుల్లగా మారి నేలలోకి నీరు ఇంకేగుణం పెరుగుతుంది. నేలలో సేంద్రియ పదార్థం వేయడం వల్ల సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయి. భాస్వరం, గంధకం వంటి పోషకాల లభ్యత గణనీయంగా ఉంటుంది.

పశువుల పేడ కంటే సారవంతం

ఎకరానికి 10 నుంచి 12 కిలోల చొప్పున జీలుగు విత్తనాల అవసరం ఉంటుంది. దుక్కిలో 20 నుంచి 30 కిలోల యూరియా వేసి ఆ తర్వాత జీలుగు విత్తనాలు చల్లుకోవాలి. 25 నుంచి 30 రోజుల్లో జీలుగు పూత దశకు వస్తుంది. ఆ తర్వాత ఎదిగిన జీలుగు మొక్కలను రోటవేటర్ సహాయంతో నేలలో కలియదున్నాలి. దున్నిన అనంతరం 100 కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేట్‌ను దుక్కిలో వేయాలి. దీని వల్ల మొక్కల అవశేషాలు బాగా కుళ్లి పచ్చిరొట్ట ఎరువు తయారవుతుంది. జీలుగు మొక్కలను కలియ దున్నడంతో తయారయ్యే పచ్చిరొట్ట ఎరువు పశువుల పేడకంటే పది రేట్లు ఎక్కువ సారవంతం చేస్తుందని అధికారులు చెబుతున్నారు.

అందుబాటులో విత్తనాలు

కౌటాల ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రంలో 40 క్వింటాళ్ల జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయాధికారులు తెలిపారు. 30 కిలోల బస్తా జీలుగు విత్తనాల అసలు ధర రూ. 2407 కాగా 65శాతం సబ్సిడీతో రూ.843లకు అందిస్తున్నారు. జీలుగు విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



రైతులు పచ్చిరొట్టపై దృష్టి సారించాలి. రైతులకు కావాల్సిన జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వం 65శాతం రాయితీపై అందిస్తున్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. రైతులకు ఎలాంటి సందేహాలున్నా స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలి.

\- పాలకుర్తి రాజేశ్, ఏవో, కౌటాల

సర్పంచ్ కుమారుడికి దేహశుద్ధి


నిందితుడు రషీద్

చింతలమానెపల్లి: రాత్రి వేళల్లో ఆదివాసీల ఇళ్లలో చొరబడుతున్నాడని బీఆర్ఎస్ నాయకుడు, గ్రామ సర్పంచ్ కుమారుడిని పట్టుకుని తాళ్లతో కట్టేసి దేహశుద్ధి చేసిన ఘటన మండలంలోని డబ్బా గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని డబ్బా గ్రామ సర్పంచ్ తాహెరా బేగం కుమారుడు అబ్దుల్ రషీద్ సోమవారం అర్ధరాత్రి గ్రామంలోని ఒక ఆదివాసీ మహిళ ఇంటిలో చొరబడుతుండగా గ్రామస్తులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం అక్కడికి చేరుకున్న పోలీసులు రషీద్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా సర్పంచ్ కుమారుడిపై చర్యలు తీసుకోవాలని జెడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అధికార పార్టీ అండతో ఆదివాసీ మహిళలపై అకృత్యాలకు పాల్పడుతున్న అబ్దుల్ రషీద్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. మహిళను కూడా పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లిన విషయంపై ఎస్సై విజయ్ కుమార్‌ను వివరణ కోరగా గ్రామంలో విచారణ జరపలేని పరిస్థితి ఉండడంతో పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చామని పేర్కొన్నారు. అయితే సదరు మహిళ ఎలాంటి ఫిర్యాదు చేయలేదని, గ్రామస్తుల నుంచి ఫిర్యాదు అందినట్లు తెలిపారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ఆసిఫాబాద్: జిల్లాలోని వెనుకబడిన వర్గాల కులవృత్తులు, చేతి వృత్తుల వారికి రూ. ఒక లక్ష వరకు ఆర్థిక సాయం పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సత్యనారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు ఫొటో, ఆధార్, కులం, ఆదాయం ధ్రువీకరణ పత్రాలతో tsobmmbc.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 6 నుంచి 20 వరకు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

జెడ్పీ జీపీఎఫ్ సిబ్బందికి సన్మానం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా జెడ్పీ కార్యాలయంలో సేవలు అందించేందుకు విధుల్లో చేరిన జెడ్పీ జీపీఎఫ్ సిబ్బంది అబ్దుల్ సమీద్, సుధాకర్‌ను మంగళవారం టీయూటీఎఫ్ సంఘం నాయకులు సన్మానించారు.